

అమెరి'కా'లేజ్

- లిపి మల్లాది



అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో.. అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ - ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..

- సంపాదకుడు

(కిందటి సంచికనుండి కొనసాగింపు)

చూస్తూ చూస్తూ సమ్మర్ పూర్తవ్వబోతుంది. ప్రతి సెమిస్టర్ డిపార్ట్‌మెంట్‌లో జరిగే రిసర్చ్‌ల గురించి ప్రతి ప్రొఫెసర్ నన్ను ఎంపిక చేసారు. అది వినగానే ఎంతో భయంగా అనిపించింది. వెంటనే స్లైడ్స్ తయారు చేయడం మొదలు పెట్టాను. రెయిన్‌తో కానీ సయ్యద్‌తో కానీ ఎక్కువగా మాట్లాడలేదు. అది గమనించి నన్ను వాళ్ళతో కలిసి లంచ్‌కి రమ్మన్నారు. నాకు ఆకలిగాలేదని, కాసేపాగి తింటానని చెప్పాను. రెయిన్ లంచ్ అయ్యాక నాకోసం రెండు స్లైసులు వెజ్ పిజ్జా తెచ్చింది.

"ఈట్ ఫస్ట్. ఇట్ విల్ హెల్ప్" అంది.

"థాంక్స్ ఎలాట్. ఐం నాట్ హంగ్రీ" అన్నాను.

ఆకలయినంత తినమంది. సయ్యద్ నా వంక చూసి "ఆర్ యు నెర్వస్?" అడిగాడు.

అవునని చెప్పాను. పెద్దగా వర్రీ అవ్వక్కర్లేదని, సులభంగానే అయిపోతుందని చెప్పాడు నేను పట్టించుకోలేదు. క్రితం సంవత్సరం సమ్మర్‌లో తనే ప్రెజెంట్ చేసానని చెప్పాడు. నాకు సహాయపడేందుకు తన స్లైడ్స్‌ని పంపుతానని చెప్పాడు. తన రిసర్చ్‌కి, నా రిసర్చ్‌కి పోలిక లేదు. తను పంపినా నాకు ఉపయోగపడవు. కానీ సహాయపడుతున్నాడని 'సరే' అన్నాను. నా గుబులు తగ్గకపోవడం గమనించి "నువ్వు ఎప్పుడైనా ఆ మీటింగ్‌కి వెళ్ళావా?" అని రెయిన్ అడిగింది.

"లేదని" తల ఆడ్డంగా ఊపాను.

"కష్టంగా వుండదు, సులభంగా అయిపోతుందని" సముదాయించింది.

నేను తినేంతసేపు ఇద్దరూ నాకు ధైర్యం చెప్పారు. ఆ తరవాత సయ్యద్ పంపిన స్లైడ్స్ తెరిచి చూసాను. తను కేవలం ఐదు మాత్రమే పెట్టాడు. నావి ఇరవైపైనే ఉన్నాయి. ఏం చెయ్యాలో తెలీక ప్రొఫెసర్‌కి నావి పంపి ఎలా ఉన్నాయని అడిగాను.

ఆయన వెంటనే తన ఆఫీసుకి నాలుగింటికి రమ్మని, అప్పటిదాకా ఆ ఫైల్లో మార్పులేమీ చేయద్దని చెప్పారు.

అవి బానే ఉన్నాయని అంటున్నారా లేక అసలే తప్పని అంటున్నారా నాకు తోచలేదు. అప్పటికి టైం రెండున్నర. లాబ్‌లో పని చేసేందుకు ఉత్సాహం కలగలేదు. ఆయన ఏమంటారో అనే ఆతృతే ఎక్కువగా అనిపించింది. మూడు ముప్పావుకే ఆయన ఆఫీసు బాయట నిలబడ్డాను. నాలుగు కాగానే ఆయన తలుపు తట్టి లోపలికి వెళ్ళాను. ఆయన వాచీ చూసి "పర్ఫెక్ట్ లీ ఆన్ టైమ్" అని నవ్వారు.

ఆయన నవ్వారంటే కోపంగా లేరని ఊపిరి పీల్చాను.

నేను పంపిన ఇరవై స్లైడ్‌లని ప్రింట్ చేసి నెమ్మదిగా పెన్ తీసుకుని కళ్ళజోడు పెట్టుకున్నారు. ఇవన్నీ నేను రాకముందే చేసి ఉండచ్చుగా అని కోపం కలిగింది. ఓ రెండు నిమిషాలు ఆ స్లైడ్లని అటూ ఇటూ తిప్పి ఏవో రాసారు. ఆ తరవాత నన్ను చూసి ఇదే మొదటిసారా అని అడిగారు.

"లేదు కాలేజీలో చాలానే చేసాను లాస్ట్ సెమిస్టర్ క్లాస్ ప్రాజెక్ట్‌కి కూడా స్లైడ్స్ ప్రిపేర్ చేసాను" అని చెప్పాను.

చిన్నగా నవ్వి రిసర్చ్‌కి క్లాస్ ప్రాజెక్ట్‌కి చాలా తేడా ఉందని, నేను టెక్నికల్‌గా వెళ్ళానే కానీ బ్యాక్‌గ్రౌండ్ గురించి ఏమీ రాయలేదని అన్నారు. "నీ ప్రెజెంటేషన్‌కి వచ్చే వారిలో నాకు తప్ప ఎవరికీ నువ్వు చేసేది తెలీదు. అసలు ఏం చేస్తున్నావు, ఎందుకు చేస్తున్నావు, దానివల్ల లాభం ఏంటి అనేది చెబితే చాలు" అన్నారు.

"దట్స్ ఆల్?"

ఆశ్చర్యపోయాను.

చిన్నగా నవ్వి "ఫర్ నౌ" అన్నారు.

నేను ఆయనకి పంపింది తరవాత పనికొస్తుందని, వాటిని డిలీట్ చెయ్యొద్దని చెప్పారు. కేవలం కట్టే కోట్టే తెచ్చేలా మూడు నుండి ఐదు స్లైడ్లు మాత్రమే పెట్టమని పంపారు. నేను అనుకున్నంత కీలకంగా కాక సులువుగానే అనిపించింది. వెంటనే ఆయన చెప్పినట్లు మూడు స్లైడ్లు చేసి పంపాను. ఆయన మళ్ళీ ఆఫీసుకి రమ్మని ఈ మెయిల్ చేసారు. ఈసారి టెన్షన్ లేకుండానే వెళ్ళిపోయాను. క్రిందటిసారి లాగా కాక ఈసారి ఆయన ముఖంలో నవ్వు లేదు ఇందాక నేను కోరుకున్నట్టే స్లైడ్స్‌ని ప్రింట్ చేసి పెట్టారు.

"వై సోమచ్ ఇన్ఫరమేషన్?" అడిగి నన్ను చూడసాగారు.

నేను బదులివ్వలేదు. ఆయన పెన్‌తో పేపర్‌లోని వాక్యాలు చాలావరకు కొట్టేసి నన్ను చూసారు. ఓన్లీ హై లెవెల్. నో డిటెయిల్స్. కొన్ని వాక్యాలు అండర్ లైన్ చేసారు. మరి కొన్నిటి చుట్టూ గుండ్రంగా సర్కిల్ గీసారు. వాటికి డయిగ్రాం పెట్టమని, లేదా ఒక స్కెచ్ గీసి చూపమని అన్నారు. కొట్టేసినవి అవసరంలేదని, అండర్ లైన్ చేసినవి మాత్రం చాలని అన్నారు. పది నిమిషాల్లో అయిపోయినా నాకు ఎంతో బాధేసింది. వెంటనే ఆ పేపర్లు తీసుకుని గబగబా ఇంటికి వెళ్ళిపోయాను. ఇంట్లో అడుగు పెట్టిన మరుక్షణం నా దుఃఖం ఆగలేదు. మంచం మీద పడి ఏడుస్తూ నిద్రపోయాను. నేను లేచేసరికి బయట వెలుతురు కొంతే ఉండడంతో సాయంత్రం అయి ఉంటుందని వంటచేసి తిన్నాను. కానీ చిత్రంగా చీకటి పెరగడం కాక తగ్గింది. నిన్న లాబ్‌కి వెళ్లకుండా ఇంటికి వచ్చేయడంలో సమయం ఎంతైందని చూసేందుకు ఫోన్ నా దగ్గరలేదు. అది లాబ్‌లోనే నా లాప్‌టాప్ పక్కన ఉంది. సమయానికి నేహ కూడా ఇంట్లో లేదు. ఆలస్యం చెయ్యకుండా స్నానం పూర్తి చేసి లాబ్‌కి బయలుదేరాను. నేను చేరేసరికి టైం ఆరుంపావు అయింది. వెంటనే ప్రొఫెసర్ చెప్పినట్లు మార్పులు చేసాను. ఈలోగా తొమ్మిది అయ్యేసరికి సయ్యద్ వచ్చాడు.

"వేర్ డిడ్ యు గో యెస్టర్‌డే?"

బదులివ్వకుండా నా స్లైడ్స్‌ని చూసి ఎలా ఉన్నాయో చెప్పమన్నాను.

'రెయిన్ చాలా కంగారు పడింది' అన్నాడు.

బదులివ్వకండా నా లాప్‌టాప్ తనకి అందించాను. కొన్ని మార్పులు చేసి "అన్నీ పాస్ట్‌టెన్స్‌లోనే ఉండాలి. ప్రెజెంటెన్స్‌లో ఉండకూడదు" అన్నాడు. ఆ తరవాత నేను పెట్టిన స్కెచ్‌ని మరో స్లైడ్‌లోకి మార్చి దాని సైజ్‌ని పెంచి, వాక్యాలు ఒక పక్కన మాత్రమే ఉండేట్టుగా పెట్టాడు. లాస్ట్ స్లైడ్‌లో కంక్లూషన్ రాయమన్నాడు. అది పూర్తిచేసి తిరిగి ప్రొఫెసర్‌కి పంపాను. ఇంతలో రెయిన్ వచ్చింది.

"నిన్న ఎక్కడికి వెళ్ళావు? మేము భయపడ్డాము" అంది.

ప్రొఫెసర్ ఆఫీసులో జరిగిన తతంగం అంతా చెప్పి మళ్ళీ కంట తడి పెట్టుకున్నాను. సయ్యద్ విచిత్రంగా నవ్వి 'దీనికే ఏడుస్తావా?' అని చులకన చేసాడు. కోపం కలిగినా, దీనికంటే అతని జీవితంలో ఎన్ని కష్టాలు ఉన్నాయో అని సరిపెట్టుకున్నాను. ఈలోగా ప్రొఫెసర్ వస్తున్న చప్పుడు వినిపించింది. వెంటనే కళ్ళు తుడుచుకుని రెయిన్ వైపు చూసాను.

'ఏం ఫరవాలేదు' అన్నట్లుగా చూసింది. ఆయన లోపలికి రాగానే నన్ను చూసి 'రాత్రంతా పడుకోలేదా?' అడిగారు.

తల ఊపుతూ "ఐ స్లెప్ట్" అన్నాను.

ఆయన చిన్నగా నవ్వి 'మరి అంత పొద్దున్నే స్లైడ్స్ మీద పని చేసావా?' అన్నారు. ఓ క్షణం రాత్రి చేసాను అందాం అనుకున్నా కానీ అబద్ధం చెప్పడానికి మనసు రాలేదు. దాంతో కేవలం తలూపాను. 'సాయంత్రం ఫోన్ ఎందుకు ఎత్తలేదు?' అడిగారు.

వెంటనే టేబుల్ మీద చూసాను, నా ఫోన్ లేదు. నిన్న వదిలిపెట్టిన బ్యాగ్‌లో చూసాను. అందులో కూడా లేదు. గాబరాగా రెయిన్‌ని చూసాను. 'తెలీదు' అని అడ్డంగా ఊపింది. ఆయన జేబులోంచి నా ఫోన్ తీసి లాబ్‌లో అలా వదిలి పెట్టకూడదు. క్లీనింగ్ వాళ్ళు కాజేసే ఆస్కారం ఉందని నా చేతికి అందించారు. అది స్విచ్ ఆఫ్ అవ్వడంతో చార్జ్‌లో పెట్టాను. నా కళ్ళు ఎర్రగా ఉండడం చుసి 'ఇట్ హోపెన్స్ టు ఎవ్రి వన్. నా మొదటి రెండు థీసిస్ పేపర్లు పబ్లికేషన్‌కి రిజెక్ట్ అయ్యాయి. పిహెచ్‌డి చేసినప్పుడు రాసినది నా మొదటి ప్రచురణ. అందరూ ఐన్‌స్టైన్‌లా మేధావులుగా పుట్టరు. మెల్లిగా నేర్చుకుంటారు. నువ్వు కూడా అలా నార్మల్ మనిషివి. మేధావి కాదు కాబట్టి నేర్చుకోవాలి. ఇవాళ పంపిన స్లైడ్స్ పర్‌ఫెక్ట్‌గా ఉన్నాయి.తరువాత సెమిస్టర్‌లో కూడా ఇలా ఇరవై పేజీలు తయారు చేస్తే నువ్వు అప్పుడు ఏడవచ్చు. ఇప్పుడు కేవలం నేర్చుకుంటున్నావు. సరేనా?" అడిగారు.

ఆనందంగా తలూపాను..

"రిలాక్స్. గో హోమ్ ఎండ్ స్లీప్" అన్నారు.

నేను రాత్రంతా పడుకున్నా అన్న సంగతి ఆయన తెలీదనుకుని నా బ్యాగ్‌లో లాప్ టాప్ పెట్టి ఇంటికి బయలుదేరాను. లాప్‌టాప్ అక్కడే వదిలేసి ఫోన్ చార్జ్ అయ్యాక లైబ్రరీకి బయలుదేరి జరిగిన సంగతంతా అన్నయ్యకి చెప్పాను.

"ఇంత చిన్నవాటికే ఏడిస్తే రేపు పెద్ద విషయాలు ఎలా డీల్ చేస్తావు?" అడిగాడు.

ప్రస్తుతానికి అంత ఆలోచించే ఓపిక లేక మాట మార్చాను. డే ఆఫ్ కాబట్టి ఏం చేయాలో తోచడం లేదని చెప్పాను. సినిమా, షికారు, జిమ్, నిద్ర వంటి సలహాలు ఇచ్చాడు కానీ నాకు అవి నచ్చలేదు. దాంతో లైబ్రరీ నుండి నడుస్తుండగా విజ్ఞేష్ కనపడి జాబ్‌కి వెళ్తున్నా అన్నాడు. ఎక్కడ అని అడిగితే మ్యూజిక్ లైబ్రరీ అన్నాడు. దాంతో తన వెంట నేనూ వెళ్ళాను. మ్యూజిక్ లైబ్రరీ అని ఒకటి ఉంటుందని నాకు ఇంతదాకా తెలియదు. అక్కడ మ్యూజిక్, ఆర్ట్స్‌కి సంబంధించిన

పుస్తకాలు ఉంటాయని, అక్కడ ఉన్న పియానో ఎవ్వరైనా వాయించవచ్చని, అలాగే వాళ్ళు గిటార్ లేదా వయలిన్ లాంటి వాద్యాలు అద్దెకిస్తారని చెప్పాడు. నేను ఎంతో ఆశ్చర్యపోయాను. అక్కడ ఉన్న వయలిన్‌ని నేను వాయిస్తాను అంటే నా చేతికి ఇచ్చాడు. రెండు క్షణాలు మించకుండానే "నీకు రాదా?" అడిగాడు.

"లేదు" అని చెప్పాను.

"మరి ఎందుకు అడిగావు?" అన్నాడు.

"నాకు ఇష్టం కానీ ఎప్పుడూ వాయించలేదు. అందుకని అడిగాను.

కాస్త చిరాకుపడి, "ఇలా పట్టుకోవాలి" అని చూపించాడు. ఎంత ప్రయత్నించినా నా చెయ్యితోపాటుగా వేళ్ళు మెలిక పడలేదు. నా కూని రాగాన్ని అతను భరించలేకపోతున్నాడని పక్కన పెట్టి అక్కడ ఉన్నపుస్తకాలు చూడసాగాను. అక్కడ ఉన్న హేడెన్ హెరేరా రాసిన ఫ్రేడా అనే పుస్తకం చదవసాగాను. ఆ ఫ్రేడా జీవితంలో ఎదురుకున్న అనారోగ్యం గురించి చదివి హృదయం తరుక్కుపోయింది. తను అమెరికాకి వచ్చిన రోజుల గురించి చదువుతుండగా "నువ్వు ఓకేనా?" అడిగాడు విజ్ఞేష్. ఎందుకు అడుగుతున్నాడా అని తలెత్తాను. అప్పుడు కళ్లల్లో నీరుందని తెలుసుకుని "ఇది చాలా బాధాకరమైన కథ" అన్నాను.

"లంచ్ టైం అయింది. వస్తావా చిపోట్లేకి?" అడిగాడు.

'సరే' అని తనతో కలిసి వెళ్ళాను. విచిత్రంగా తను అక్కడ తినకుండా టు గో తీసుకున్నాడు. నేను కూడా అంతే చేసాను. క్లాస్‌కి టైం అయ్యిందని, అది అయ్యాక తింటానని చెప్పాడు. నన్ను మ్యూజిక్ లైబ్రెరీ దగ్గర దింపి వెళ్ళిపోయాడు. నేను బయట హాల్లో కొంత తిని తిరిగి ఆ ఫ్రేడా బుక్ చదవసాగాను. ఈసారి ఇక్కడ ఉన్న లైబ్రేరియన్ మన దేశస్థుడుకాదు. అక్కడి పుస్తకాలు తీసుకోవచ్చా అని అడిగాను నా ఐడి చూసి తీసుకోవచ్చన్నాడు. మ్యూజిక్‌కి సంబంధించిన పుస్తకాలు ఏవి బావుంటాయి అని అడిగాను .ఆశ్చర్యంగా నా ముఖం చూసి 'ఇక్కడ అన్నీ బానే ఉంటాయి అన్నాడు'. కాసేపటికి నేను కష్టపడుతున్నానని గమనించి కొన్ని పుస్తకాలు తెచ్చి ఇచ్చాడు.

"దీజ్ ఆర్ మై ఫేవరెట్స్" అన్నాడు.

అవి తీసుకుని ఇంటికి బయలుదేరుతుండగా, 'కొత్త స్టూడెంటా?' అని అడిగాడు.

'లేదు పాత విద్యార్థినే ' అని చెప్పాను.

'మరి ఇంతకాలం చూడలేదు లైబ్రరీలో ' అన్నాడు.

నేను ఏరోస్పేస్ స్టూడెంట్‌అని, ఫ్రెండ్‌తో కలిసి మొదటిసారి వచ్చానని చెప్పాను. మ్యూజిక్ ఇంట్రెస్ట్ ఉంటే సమ్మర్‌లో జరిగే కోర్సులకి వేరే డిపార్ట్‌మెంట్ వారు కూడా రావచ్చని, ఆలస్యం అయిపోయింది కాబట్టి కావాలంటే రేపు కేవలం చూసేందుకు వాళ్ళ క్లాసు హాజరు అవ్వమని చెప్పాడు. బిల్డింగ్, రూం నంబరు, టైం తెలుసుకుని థాంక్స్ చెప్పాను.

ఆఖరి రెండు క్లాసులు మిగలడంతో రేపటి క్లాసులో ఎగ్జామ్ జరుగుతుందని, విద్యార్థులు వాళ్ళ సొంత మ్యూజిక్ ప్రెజెంట్ చేస్తారని, ప్రొఫెసర్‌తో పాటు విద్యార్థులు కూడా గ్రేడ్ చెయ్యాలని చెప్పాడు.

ఎంతో ఆశ్చర్యంతో 'తప్పకుండా వస్తానని' వచ్చేసాను .

మధ్యాహ్నం ఎండ బాగా వేడిగా ఉండడంతో ఇంటికి వెళ్ళేసరికి ఎంతో అలిసిపోయాను. చల్లటి నీరు తాగుతూ, ఫ్రేడా పుస్తకం చదువుతూ మిగతా రోజు పూర్తి చేసాను.

(కొనసాగింపు వచ్చేలలో)

Click here to share your comments on this story